క్లుప్తంగా

గాజువాకలో 75 అనధికార విగ్రహాలు

గాజువాక: గాజువాక జోన్‌లో దేశ నాయకులు, స్థానిక నాయకులు, పలుకుబడి ఉన్నవారికి సంబంధించిన 75 అనధికార విగ్రహాలున్నట్టు జీవీఎంసీ అధికారులు ధ్రువీకరించారు. మహాత్మా, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు జాగరపు శ్రీను నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని తొలగించిన జీవీఎంసీ అధికారులు దాన్ని ఇప్పటివరకు అతడికి తిరిగి ఇవ్వలేదు. ఆ విగ్రహాన్ని తనకు ఇవ్వాలని అధికారులకు వినతి పత్రాలను ఇవ్వడంతోపాటు గాజువాకలో అనధికారికంగా ఎన్ని విగ్రహాలున్నాయంటూ సమాచార హక్కు చట్టం ద్వారా కోరారు. అన్ని వార్డుల్లోను మొత్తం 75 విగ్రహాలున్నట్టు సమాధానమిచ్చారు. ఇన్ని విగ్రహాలు అనధికారికంగా ఉన్నప్పుడు తాను ఏర్పాటు చేసిన మహాత్ముని విగ్రహాన్ని అధికారులు తొలగించడం ఆవేదన కలిగిస్తోందని శ్రీను వాపోయాడు.

మహిళా క్రికెటర్ షబ్నమ్‌కు సత్కారం


షబ్నమ్‌ను సత్కరిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారిణి ఎండీ షబ్నమ్ శనివారం సందడి చేసింది. వినాయకనగర్ వుడా కాలనీలోని చైతన్య కళాశాల పక్కన కొత్తగా ఆర్మీ మాజీ ఉద్యోగులు సారిపిల్లి రంగబాబు, పప్పల శ్రీనివాసరావు ఏర్పాటు చేయనున్న జవాన్స్ స్పోర్ట్స్ అండ్ స్టేషనరీ లోగోను షబ్నమ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అండర్-19 ఉమెన్స్ వరల్డ్ కప్‌లో ఆడిన మధురజ్ఞాపకాలను, తోటి మహిళా క్రికెటర్లను కలిసి చేసిన ప్రయాణాన్ని పంచుకున్నారు. క్రీడా రంగంలో మహిళలు రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమెను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, పార్టీ 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, నిర్వాసితుల సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి తదితరులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూబీసీ, బీబీసీ బాక్సింగ్ కోచ్‌లు, డాక్టర్ ఆర్.గోవింద్, జీవీ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతే పెద్ద సంపద


సదస్సులో పాల్గొన్న యువతతో నిర్వాహకులు

ఏయూక్యాంపస్: ప్రపంచ దిశ దశను మార్చగల సత్తా యువతకే ఉందని సహజ యోగ ప్రతినిధి నేషనల్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు రమేష్ అన్నారు. ఏయూ స్నాతకోత్సవ మందిరంలో నిర్వహిస్తున్న మాతాజీ నిర్మలాదేవి శత జయంతి ఉత్సవాలలో భాగంగా రెండో రోజు యువశక్తి విభాగం ఆధ్వర్యంలో యువతకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నేడు యువత పెడతోవ పట్టడానికి గల కారణాలను సహజ యోగ ప్రతినిధులు వివరించారు. యువత చక్కని లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరేందుకు క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలన్నారు. యువత పోషించే పాత్ర పైనే ఆ దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సోంబాబు, వెంకటరెడ్డి, పద్మావతి పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా కొణతాల

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గాయత్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొణతాల వెంకట అప్పారావు(శ్రీనివాస్) కాంగ్రెస్ తరఫున బరిలో దిగుతున్నారు. పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు.

సర్వం..శివోహం

- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

మహాశివరాత్రి వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. గాజువాక నియోజకవర్గంలోని శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పరమ శివుడ్ని ఆరాధించారు.


షీలానగర్‌లోని సుందరేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు


స్టీల్‌ప్లాంట్ : శివ పార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

గాజువాక: పవిత్ర మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గాజువాక ప్రాంతం శివనామస్మరణతో హోరెత్తింది. ఆలయ కమిటీలు ఈ ఉత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాయి. వినాయకనగర్ వుడాకాలనీ కాశీ విశాలాక్షి విశ్వేశ్వర సహిత పంచాయతన ఆలయం, గాజువాక 70వ వార్డు చట్టివానిపాలెం, చిట్టినాయుడుకాలనీ ఈశ్వరాలయం, అయ్యప్పస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దుర్గవానిపాలెం, గాజువాక గౌరీపరమేశ్వరుల ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీసీరోడ్డు సంజీవకాలనీలో భద్రావతి భావనా రుషీశ్వరుల సమేత సత్యనారాయణ స్వామి ఆలయం, సత్తెమ్మ తల్లి ఆలయంలోనూ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకాలు, రాత్రికి శివలింగార్చనలు నిర్వహించారు. 71వ వార్డు దుర్గానగర్‌లోని శ్రీదుర్గా గణపతి సమేత మహాజ్ఞాన సరస్వతి దేవాలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజా మహోత్సవాలు నిర్వహించారు. చినగంట్యాడ వందడుగుల రోడ్డులోని మంజునాథ ఆలయంలో విశేష పూజలు చేశారు. సహస్ర లింగార్చన అభిషేక పూజా మహోత్సవాలతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. సనత్‌నగర్ ఆలయంలో భక్తులు పోటెత్తారు. బీసీ రోడ్డులోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి ఆర్.హెచ్ కాలనీలోని శ్రీ ఉమామార్కండేయ స్వామి ఆలయం శివనామసర్మరణలతో మార్మోగింది. ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

86వ వార్డులో..

జీవీఎంసీ 86వ వార్డు పరిధి సాయిరాంనగర్‌లో ఉన్న 18 అడుగుల ఏకశిలా శివలింగానికి మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

స్టీల్‌ప్లాంట్ శివాలయాల్లో ...

ఉక్కునగరం: మహాశివరాత్రి సందర్భంగా సెక్టార్-2కు చెందిన సత్యసాయి భక్తులు ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం మహాన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు విశ్వశాంతి, విశ్వమానవ కల్యాణం కోసం ప్రత్యేక భజనలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సమితి కన్వీనర్ జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు సమీప ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతులు కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉక్కు ఉద్యోగుల దంపతులు కళ్యాణంలో పాల్గొన్నారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి లింగోద్భవ సమయం వరకు రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఎల్లేటి శ్రీనివాస్, చీకటి శ్రీనివాస్, భద్రు నాయక్, సురేంద్ర, నాగభూషణరావు, మోహన్‌రావు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- స్టీల్‌ప్లాంట్ రవిరేస్ బంక్ సమీప పాత కణితి శివాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా రుత్వికుల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డ గోవింద, ఆడారి శ్రీను, చిత్రాడ రాజు, పిన్నింటి సంతోష్, ఆలయ కమిటీ ప్రతినిధులు రామారావు, సన్యాసిరావు, అప్పలనాయుడు,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబేకాలనీలో గల వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనకాపల్లికి చెందిన పీలా వెంకట జగ్గారావు కుమారుల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు ప్రారంభించారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మంజుల, పండూరి రామారావు, ఆదిలక్ష్మి, సత్యవతి, సావిత్రి, లక్ష్మి, నాగమణి, కవిత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో అభిషేకాలు

అగనంపూడి: జీవీఎంసీ 85, 79 వార్డులోని శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పెదమడకలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయానికి చేరుకొని అభిషేకాలు జరిపించారు. అగనంపూడి సమీప కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పూజలు ఆచరించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో అప్పికొండ సముద్ర తీరానికి స్నానమాచరించడానికి భక్తులు వెళ్లారు.కర్రివాని పాలెంలోని సంతోషి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. అగనంపూడిలోని బ్రహ్మకుమారీల ఏర్పాటు చేసిన బంగారు శివ లింగం, అమర్‌నాథ్ నమూనాలను వేలాది మంది భక్తులు వీక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి ఆషాదేవి, సంస్థ జిల్లా ఇన్‌చార్జ్ బీకే సోమేశ్వరి, కోఆర్డినేటర్ బీకే త్రివేణి, అగనంపూడి ఇన్‌చార్జ్ రామకోటి పాల్గొన్నారు. 79వ వార్డు అగనంపూడి కైలాస భూమిలో రిటైర్డ్ లైబ్రరియన్ పిల్లా సన్యాసిరావు స్మారకార్థం శ్మశానంలో కైలాసనాథుని విగ్రహం ఏర్పాటు చేశారు.


కణితి ఉమా మార్కండేయ స్వామి ఆలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు


భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

పోటెత్తిన శివాలయాలు

పెదగంట్యాడ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు పోటెత్తాయి. తులసికోట, ధ్వజస్తంభం, నందీశ్వరుని వద్ద దీపారాధన చేశారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బాలచెరువు ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాలతో అభిషేకాలు, హోమాలు, రుద్రాభిషేకాలు చేశారు. పెదగంట్యాడ శివాలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. వుడా కాలనీలో శివాలయంలో పార్వతీపరమేశ్వరులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వినాయకనగర్ వుడా కాలనీలోని విశాలాక్షి విశ్వేశ్వర పంచాయతన ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆయా ఆలయాల్లో ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే శివలింగం, ఓం తదితర రూపాలతో కూడిన దీపాలను వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వినాయకనగర్ వుడా కాలనీలో బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో జ్యోతిర్లాంగాలను ఏర్పాటు చేశారు. అందులో ఓంకారేశ్వరుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.


సాయిరాంనగర్‌లోని 18 అడుగుల ఏకశిలా శివలింగం


బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు


పూజలందుకుంటున్న అప్పికొండ సోమేశ్వరస్వామి


కణితి రోడ్డులోనిశివాలయంలో భక్తుల రద్దీ

విశాఖ ఉక్కును రక్షించుకుంటాం


కార్మికులకు జ్యూట్ బ్యాగులను అందజేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని, నాటి కార్మిక మహనీయుల త్యాగ ఫలితాన్ని వృథాగా కానివ్వమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. శనివారం 737వ రోజుకు చేరుకున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన సీఎంఎం, సీఎంఈ, సీఆర్ఎంపీ, టెలిసెల్, లూబ్రికెంట్ సెల్ పలు విభాగాల కార్మికుల పాల్గొని సంఘీభావం తెలిపారు. 1991 బ్యాచ్ సీఎంఎం కార్మికులు సుమారు 50 మంది స్టీల్ ప్లాంట్ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సేవ్ వైజాగ్ స్టీల్, స్టాప్ ప్రైవేటైజేషన్ పేరుతో ప్రచురితమైన జ్యూట్ బ్యాగులను కార్మికులకు పంపిణీ చేశారు. కార్మికులను ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, గుమ్మడి నరేంద్ర మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు స్ఫూర్తితో ఉక్కు పోరాటాన్ని కొనసాగిస్తున్నామన్నారు. విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.రామారావు, అయోధ్యరామ్, సన్యాసిరావు, రామ్మోహనకుమార్, కరణం సత్యారావు, కార్మికులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ కోసం లక్ష సంతకాల సేకరణ


సంతకాలు సేకరిస్తున్న నేవల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు

అగనంపూడి: పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని, విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ నేవల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో అగనంపూడి శివాలయాల వద్ద లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. యూనియన్ నాయకులు కొరాయి నాగార్జున సారథ్యంలో శివాలయ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించి తరువాత భక్తులనుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ లక్ష సంతకాల సేకరణ చేపట్టి రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి పంపించనున్నామన్నారు. లాభాల బాటలో పయనిస్తున్న విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని, అనేక ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి టోకుగా అమ్మేస్తున్న కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు చిట్టిరాజు, కొలిపాక అప్పారావు, గవర వెంకటేశ్వరరావు, రమేష్, కాశీమ్, జగన్, సిహాద్రినాయుడు, సోమునాయుడు, నరసింగరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నెహ్రూ అవార్డులు


సీఎండీ నుంచి అవార్డు అందుకుంటున్న విశ్వనాథరాజు, రఘు నాయక్, వెంకటరమణ, ఎల్లేటి శ్రీనివాసరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 96 మంది ఉద్యోగులకు యాజమాన్యం జవహర్‌లాల్ నెహ్రూ అవార్డులను అందజేసింది. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకత, క్షమశిక్షణ కలిగిన ఉద్యోగులకు ఏటా ఉక్కు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అవార్డులను అందజేస్తోంది. ఇందులో భాగంగా శనివారం ఉక్కునగరం ఎంపీ హాలులో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ చేతులు మీదుగా 49 మంది అధికారులు, 49 మంది కార్మికులకు అవార్డులను అందజేశారు. అదే విధంగా ప్రతిభ చూపిన సీఐఎస్ఎఫ్ సిబ్బందికి కమెండేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు వీవీ వేణుగోపాలరావు, డీకే మహంతి, బాగీౖతో పాటు పలువురు ఉన్నతాధికారులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మోదీ విధానాలతో ఇబ్బందులు


సమావేశంలో మాట్లాడుతున్న స్టాలిన్

గాజువాక: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విధానాలన్నీ అప్రజాస్వామికమని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్ ఆరోపించారు. చైతన్యనగర్‌లో శనివారం నిర్వహించిన 72వ వార్డు సీపీఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, దీనివల్ల అన్ని రంగాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నారని, దీనికోసం అనేక పరిశ్రమలను నిర్వీర్యం చేశారన్నారు. అదాని, అంబానీవంటి కార్పొరేటర్లద్వారా బోగస్ కంపెనీలను తెరపైకి తీసుకొచ్చి ప్రజా సంపదను లూటీ చేస్తున్నారన్నారు. బీజేపీ అధికారం చేపట్టిన తరువాత ప్రజల అవస్థలు పెరిగాయన్నారు. బీజేపీ పాలనను అంతమొందించే విధంగా ప్రజలను సన్నద్ధం చేయడానికి కార్యకర్తలు సంసిద్ధులుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎ.విష్ణుమూర్తి, జి.ఆనంద్, పానగంటి భాస్కర్, పెంటకోట నర్సింగరావు, ఎం.రామారావు, కె.వి.కుమారి, ఎ.శ్రీలక్ష్మి, పిల్లా సూర్యపద్మ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కెరీర్ ఓరియంటేషన్, గైడెన్స్ సెల్

- గిరిజన వసతిగృహాన్ని సందర్శించిన ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు
- వార్డెన్ బదిలీకి సిఫారసు


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రవిబాబు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): ఎంవీపీ కాలనీలోని గిరిజన విద్యార్థినుల వసతి గృహంలో కెరీర్ ఓరియంటేషన్, గైడెన్స్ సెల్ త్వరలో ఏర్పాటు చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వసతి గృహానికి చేరుకున్న ఆయన గంటన్నరకు పైగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్య, వాష్ రూమ్స్, వార్డెన్ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్టాక్ ఫైల్స్, మెస్ నిర్వహణను పరిశీలించారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి నిర్వహణ బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఐదేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్న వార్డెన్ బదిలీకి సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. బాత్ రూమ్స్‌కు తలుపులు సక్రమంగా లేకపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం వంటి పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి రవిబాబు మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలు దిశగా విద్యనభ్యసించాలని సూచించారు. హాస్టల్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన బీచ్‌లే లక్ష్యం



యారాడ బీచ్‌లో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న నేవీ అధికారులు

పెదగంట్యాడ: తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని తూర్పు నావికాదళ అధికారులు తెలిపారు. పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా యారాడ, ఆర్కే, భీమిలి బీచ్‌లతో పాటు మేఘాద్రిపేట పరివాహక ప్రాంతంలో శనివారం చెత్తాచెదారాన్ని తొలగించారు. అన్ని ప్రాంతాల్లో కలిపి మొత్తం 410 కిలోల చెత్తాచెదారాన్ని ఏరారు. కోస్టల్ క్లీనప్ కింద ప్రతి నెలా ఓ రోజు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో నావికాదళానికి చెందిన 550కి పైగా సర్వీస్, డీఎస్సీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

పీఎం పాలెం: మహిళపై దాడి చేసి గాయపరచిన కేసులో ఒకరికి న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 6వ వార్డు పరిధి కొమ్మాది అమరావతి కాలనీకి చెందిన ఉప్పాడ లక్ష్మిపై ఒడిశా రాష్ట్రానికి చెందిన సయ్యద్ రఫీ అక్టోబర్ 5, 2020న కత్తితో దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలు పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రవికుమార్ హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి ఎస్ఐ నీహార్‌కు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. విచారణ జరిపిన అనకాపల్లి అడిషనల్ అసిస్టెంట్ జడ్జి నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించారని సీఐ రామకృష్ణ తెలిపారు.

22న ప్రపంచ స్కాట్ థింకింగ్ డే

మద్దిలపాలెం: స్కాట్స్ అండ్స్ గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న స్కాట్ థింకింగ్ డే నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కమిషనర్ నరవ ప్రకాశరరావు తెలిపారు. ప్రపంచ స్కాట్ ఉద్యమ నిర్మాత బాడెన్ పావెల్ 1857 ఫిబ్రవరి 22న లండన్‌లో జన్మించారన్నారు. ఆయన జయంతి రోజున ప్రపంచ స్కాట్ అండ్ గైడ్స్ దినోత్సవంగా జరపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఆదేశాల మేరకు ఈనెల 22, 23 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించడంతో పాటు పలు అంశాలపై పోటీలు ఏర్పాటు చేశామన్నారు. బీహెచ్‌పీవీ మార్గంలోని సంసిదా ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.